
సాక్షి ఒడిశా

సోమవారం । 13 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 6,12,247లు, బంగారం 19 గ్రాముల 250 మిల్లీ గ్రాములు, వెండి 9 గ్రాముల 600 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



పోగొట్టుకున్న మొబైల్ అందజేత

- 8లో

వ్యాస రచన పోటీలు

భువనేశ్వర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు పురస్కరించుకొని రాష్ట్రేతర తెలుగు సమాఖ్య(రాతెస) మహిళలకు వ్యాస రచన పోటీలు ఆదివారం నిర్వహించింది. పోటీల్లో పాలూరి లక్ష్మి(హైదరాబాద్), దర్భా అంజనీవతి (రాజమండ్రి), లక్ష్మీమోహన్(ఢిల్లీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ముద్దు వెంకటలక్ష్మి(బెంగుళూరు) ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు.

న్యూస్‌రీల్

జ్యోతిర్మయికి ఐయూపీఏసీ అవార్డు



జ్యోతిర్మయి మహంతి

భువనేశ్వర్: ఒడియా వైజ్ఞానికురాలు జ్యోతిర్మయి మహంతి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐయూపీఏసీ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును అందుకోనున్న దేశంలోనే తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. ఈమె రసాయన శాస్త్ర రంగంలో సాధించిన విశిష్టతకు ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ (ఐయూపీఏసీ) అవార్డును అందుకోనుండడం విశేషం. అలాగే సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు ఫెలోషిప్ అందుకున్న తొలి మహిళ కావడం మరో విశేషం. ఈమె గతేడాది ప్రతిష్టాత్మక బ్రిటన్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం భావ ఇంటర్నేషనల్ రీసెర్చ్ సెంటర్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు. ఆమెకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మూడు నామినేషన్లు దాఖలు



నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

జయపురం: ఏప్రిల్ 15వ తేదీన జరగనున్న ఒడిశా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి కొరాపుట్ జిల్లా బార్ కౌన్సిల్ జయపురం నుంచి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కొరాపుట్ జిల్లా జయపురం నుంచి రాష్ట్ర బార్ కౌన్సిల్ కమిటీకి గతంలో జరిగిన ఎన్నికల్లో పలువురు న్యాయవాదులు ఎన్నికయ్యారు. దీంతో ఈ ఎన్నికలో సైతం రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో స్థానం సంపాదించాలని జిల్లా బార్ అసోసియేషన్ కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుత రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బిష్ణు ప్రసాద్ పాత్రోతో పాటు సీనియర్ న్యాయవాదులు పి.రమేష్‌చంద్ర పాత్రో, పద్మణ స్వైలు తమ మద్దతుదారులతో నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులను అన్ని బార్ అసోసియేషన్ల సభ్యులు ఎన్నుకుంటారు.

సంతోష్ మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: స్థానిక అప్పర్‌కొలాబ్ ప్రాజెక్టు సాగునీటి కెనాల్‌లో గల్లంతైన ఎస్.సంతోష్ మృతదేహం ఎట్టకేలకు ఆదివారం లభ్యమైంది. గొడాపొదర్ పంచాయతీ కొలాగుడ గ్రామ సమీప కెనాల్‌లో తేలుతున్న యువకుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మృతుడు జోగి మఝి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ గోరక్‌పూర్ కూడలిలో శనివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైకు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతుడు సిరిపాయి పంచాయతీలోని బలంగీర్ గ్రామానికి చెందిన జోగి మాఝి(26), గాయాలపాలైన వ్యక్తులు బలంగీర్ గ్రామానికి చెందిన గోపబంధు మాఝి (32), సర్గిపాదొరా గ్రామానికి చెందిన సుందర్‌లాల్ నాయక్ (29)లుగా పోలీసులు గుర్తించారు. బైకులో టికిరి నుంచి తమ సొంత గ్రామానికి వస్తున్న గోపబంధు, జోగిలు ఎదరుగా వస్తున్న ఆటోను అదుపుతప్పి బలంగా ఢీకొన్నారు. క్షతగాత్రులను టికిరిలోని ఉషా పాడు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యకిచ్చిన మాట..!



సిద్ధమైన సంతోషి మాత ఆలయం

- రూ.8 కోట్లతో సంతోషిమాత ఆలయ నిర్మాణం
- 3 ఎకరాల స్థలంలో నిర్మాణం పూర్తి
- పెళ్లి నాడు వాగ్దానం చేసిన భర్త



ఖేత్రాబాసి లెంక, బైజయంతి లెంక దంపతులు

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా బింజార్‌పూర్ మండలం ఛికొణ గ్రామంలో అద్భుతమైన సంతోషి మాత ఆలయ నిర్మాణం పూర్తయ్యింది. సుమారు 3 ఎకరాల స్థలంలో 64 అడుగుల ఎత్తుతో రూ.8 కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ ఆలయ నిర్మాణ శైలితో ఈ ఆలయం అత్యంత ఆకర్షణీయంగా మెరుగులు దిద్దుకుంది. భార్యకు ఇచ్చిన మాట ప్రకారం అత్తవారి ఊరులో సంతోషి మాత ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోవడం ఈ ఆలయం విశిష్టత. హైదరాబాద్‌లోని పారిశ్రామికవేత్తగా స్థిరపడిన జగత్‌సింగ్‌పూర్ ప్రాంతానికి చెందిన ఖేత్రాబాసి లెంక తన భార్య బైజయంతి లెంకకు పెళ్లినాడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి ఈ ఆలయం నిర్మించి పలువురి అభినందనలు అందుకుంటున్నాడు.

వివరాల్లోకి వెళ్తే...

బైజయంతి చిన్ననాటి నుంచి సంతోషిమాత భక్తురాలు. గ్రామంలో అమ్మవారి ఆలయం లేకపోవడంతో అమ్మవారి ఫొటోను ఇంట్లో ఉంచి పూజలు చేసుకునేది. ఆమె ఆరో తరగతి చదువుతున్న రోజుల్లో కొన్ని కారణాలు వలన ఫొటోను పూజించడానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. దీంతో గ్రామంలో ఆలయం ఉంటే ఇటువంటి విచారకర పరిస్థితి తలెత్తేది కాదని ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. అనంతరం 1992 సంవత్సరంలో ఖేత్రాబాసి లెంకతో ఆమెకి వివాహం జరిగింది. అప్పుడు ఆమె చిన్ననాటి వేదనని భర్తతో పంచుకోవడంతో కల ఫలించింది. భార్య అకుంఠిత భక్తిశ్రద్ధలపై తన్మయం చెందిన భర్త, అత్తవారి ఊరులో సంతోషిమాత ఆలయం నిర్మించేందుకు సంకల్పించాడు. గ్రామస్తుల సహకారంతో భార్యాభర్తల సంకల్పం మరింత బలంగా ముందుకు సాగింది. తన కోసం భర్త ఆలయం కట్టించి గ్రామానికి ఇవ్వడం కంటే అమూల్యమైన కానుక వేరేమీ ఉండదని బైజయంతి లెంకా మురిసిపోతోంది.

పుట్టిన రోజున శంకుస్థాపన

2008 మార్చి 10వ తేదీన బైజయంతి లెంకా కుమార్తె పుట్టిన రోజు పురస్కరించుకొని గ్రామంలో సంతోషిమాత ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2014 వరకు ఆలయ పనులు శరవేగంగా సాగాయి. ఆ తర్వాత క్రమంగా ఈ పనులు మందగించాయి. నత్తనడకన సాగిన నిర్మాణం పనులు పూర్తయ్యేందుకు దాదాపు 15 ఏళ్ల పట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన 40 మంది శిల్పులు నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఆలయం నిర్మాణం పూర్తి చేశారు. స్థానిక శిల్పులు తమ వంతు సహాయ సహకారాలు అందజేశారు. రాజస్థానీ శిల్పులు పాలరాతి పనులకు నగిషీలు దిద్దారు. ఈ ఆలయ ప్రాంగణంలో శివుడు, గణేష్, హనుమాన్, నవగ్రహాల ఆలయాలు నిర్మించారు. ఆలయం పేరుతో నిర్మాణ స్థలం కొనుగోలు చేశారు. రూ.8 కోట్ల భారీ వ్యయంతో ఆలయాన్ని నిర్మించడం అమ్మవారి అనుగ్రహం మాత్రమేనని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయం అత్యంత మహిమాన్వితంగా వెలుగొందుతుందని భక్తిభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.30 లక్షల అంచనా వ్యయం

భార్య బైజయంతి లెంక కోరిక మేరకు సంతోషి మాత ఆలయ నిర్మాణానికి ఖేత్రాబాసి లెంక 2008 సంవత్సరంలో సంకల్పించారు. అప్పట్లో ఈ ఆలయ నిర్మాణ వ్యయం అంచనా రూ.30 లక్షలు మాత్రమే. 5 సంవత్సరాల్లో ఆలయ నిర్మాణం పూర్తవుతుందని భావించారు. అయితే దాదాపు 15 ఏళ్ల పాటు అడుగడుగున పలు అవాంతరాలు తలెత్తినా నిర్మాణం విజయవంతంగా పూర్తి కావడంపై లెంకా దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలయాపనతో నిర్మాణ వ్యయం క్రమంగా పెరుగుతూపోయింది. చివరకు చిన్న ఆలయంగా సంకల్పించిన సంతోషి మాత ఆలయం 64 అడుగుల ఎత్తుతో నింగిని తాకుతున్నట్లు ఎదగడం అమ్మవారి అనుగ్రహంగా భావిస్తున్నారు. త్వరలో ఆలయం పూర్తి హంగులతో భక్తుల సందర్శనకు అందుబాటులోకి వస్తుంది.

15 ఏళ్లు పట్టింది

ఈ గుడి మా ఊరు ప్రజల కోసం కట్టించడం జరిగింది. సంతోషిమాత ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సైతం చాలా సహకారం అందించారు. 15 ఏళ్ల తర్వాత ఇప్పుడు ప్రధాన ఆలయ నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఆలయ సముదాయంలో పూల అంగడి, పూజ సామాగ్రి దుకాణం వంటి మౌలిక వసతులు అంచెలంచెలుగా ఏర్పాటు అవుతాయి. ఆలయ సముదాయంలో భక్తుల కోసం ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తాం.

– బైజయింతి లెంకా

ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం



పాలవలస విక్రాంత్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సమాఖ్య సభ్యులు

రాయగడ: పట్టణంలోని రెండు వేదికల్లో ఈసారి ఉగాది వేడుకలు జరగనున్నాయి. ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక హీరో షోరూమ్ సమీపంలో ఉన్న మైదానంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు స్థానిక తేజస్వి హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో మాజీ ఎంపీ నెక్కంటి అధ్వర్యంలో ఉగాది ఉత్సవాల నిర్వహణ కోసం పనులు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ఉత్కళ తెలుగు సమాఖ్య సభ్యులు ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖులకు ఉత్సవాలను తిలకించేందుకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తుండడం విశేషం. ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు తదితరులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. సమాఖ్యకు చెందిన కింతలి రాజు, కాసీనాయుడు తదితరులు స్వయంగా వారిని ఆహ్వానించేందుకు వెళ్లారు.

పోటీపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు

ఉగాది సంబరాల్లో రెండు వర్గాల వారు పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో జబర్దస్త్ దొరబాబు, అవినాష్, ఫైమా, వినోద్‌లు అలరించేందుకు వస్తుండగా, సినీ నేపథ్య గాయకులు దీపు, భార్గవి పిల్లయ్, సోని, టాలీవుడ్ హీరోయిన్ మెహరిన్, ప్రియాంక నిర్వాన్‌లు హాజరవ్వనున్నారు.

గ్లకోమాపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: కంటికి వచ్చే గ్లకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎంకేసీజీ కంటి విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ సుబుద్ధి అన్నారు. ఎంకేసీజీ కంటి విభాగం ఆధ్వర్యంలో గ్లకోమా వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ రాధ మాధవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం పట్టణంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

15న బంద్‌కు పిలుపు



మాట్లాడుతున్న డ్రైవర్లు

మల్కన్‌గిరి: జిల్లాలో ఉన్న 2000 మంది డ్రైవర్లు ఈనెల 15వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు మల్కన్‌గిరి బస్టాండ్ వద్ద ఆదివారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి 11 డిమాండ్స్ చేశారు. డ్రైవర్లకు ప్రతీ వంద కిలోమీటర్లకు ఒక రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినవారికి రూ.5 లక్షల ఇన్సురెన్స్ ఇవ్వాలన్నారు. అలాగే గాయపడినవారికి సైతం గతంలో ఇస్తామని చెప్పిన ప్రయోజనాలు ఇప్పించాలని కోరారు. లేకపోతే రాష్ట్ర స్థాయిలో బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు.

స్ఫూర్తి ప్రదాత మహిళ



చెన్నైలో పద్మశ్రీ కన్యాకుమారిని సత్కరిస్తున్న రాతెస సభ్యులు

భువనేశ్వర్: ఇంటా, బయట అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని రవీణా చవాన్ అన్నారు. జూమ్ వేదికగా రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో వ్యాపారవేత్తలుగా మహిళలు సాధించిన ప్రగతి–సమస్యలు శీర్షికపై ఆమె సుదీర్ఘంగా ప్రసంగించారు. ఇల్లాలిగా నిర్వహించాల్సిన బాధ్యతలను విస్మరించకుండానే, వర్తక, వ్యాపార, పారిశ్రామిక, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బాధ్యతల నిర్వహిస్తూనే దేశ, విదేశాల్లో మహిళలు ఉనికి చాటుతుండడం గొప్ప విషయమన్నారు. నేటి యువతులు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కుటుంబాల్లో పిల్లల పెంపకం–మహిళల బాధ్యత శీర్షికపై డాక్టర్ ఆముక్త మాల్యద తిరుమల మాట్లాడారు. భర్తతో కలిసి నడుచుకుంటే సామాన్య ఇల్లాలు అష్టలక్ష్మిగా శోభిల్లుతుందని వాణి ప్రభాకర్ అభినందించారు. మహిళలు–వృద్ధాశ్రమాలు శీర్షికపై మాట్లాడుతూ బాల్యం నుంచి కుటుంబంలో తారసపడే అత్తా–కోడళ్లు, భార్యా–భర్తలు, అమ్మ–నాన్నల పోకడ ఈ వైపరీత్యాన్ని ప్రేరేపిస్తుందన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి 60 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లో విశిష్టత సొంతం చేసుకున్న ప్రముఖ మహిళలను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న రాతెస సభ్యులు ఆయా ప్రముఖుల స్వగృహాల్లో ఈ సత్కారం నిర్వహించారు. వయోలిన్ వాద్య రంగంలో పద్మశ్రీ పురస్కారం సాధించిన కన్యా కుమారి(చెన్నై), ఇతర రంగాల్లో డి.కామేశ్వరి (హైదరాబాద్), ప్రభాశాస్త్రి (మైసూర్), కుసుమ (ఢిల్లీ), జోగామణి (ముంబై) ప్రాంతాల్లో రాతెస మహిళా దినోత్సవ సత్కారం అందుకున్నారు. కార్యక్రమానికి ఎ.పూర్ణలత(ముంబై) అధ్యక్షత వహించారు.



జూమ్ వేదికగా రాతెస అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వర్సిటీ హోదా కల్పించాలి

- మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గోమాంగో



సమావేశంలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గోమాంగో, కలెక్టర్ లింగరాజ్ పండా తదితరులు

పర్లాకిమిడి: దాదాపు 127 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీకృష్ణ చంద్ర గజపతి అటానమస్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ హోదా కల్పించాలని బీఆర్‌ఎస్ నేత గిరిధర్ గోమాంగ్ కోరారు. కళాశాల ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో చదువుకున్నవారు ఉన్నతాధికారులుగా, ప్రజాప్రతినిధులుగా, మంత్రులుగా ఉన్నారని, వారు కళాశాలను మరవడం తగదని గుర్తు చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన బరంపురం వర్సిటీ మాజీ ఉపకులపతి జయంత్ కుమార్ మహాపాత్రో మాట్లాడుతూ.. మహారాజా కళాశాలకు వర్సిటీ హోదా కల్పిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. పార్ట్ టైం అధ్యాపకులుగా, గెస్ట్ లెక్చరర్లుగా పూర్వపు విద్యార్థులు పని చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కళాశాలకు విశ్వవిద్యాలయం స్టేటస్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించామని, కళాశాలలో ఈ–లైబ్రరీ, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లింగరాజ్‌పండా తెలియజేశారు. అనంతరం మాజీ విశ్రాంత అధ్యాపకుడు ఆర్.కె.భుయాన్, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ త్రిపాఠి, కళాశాల విద్యార్థుల సంఘం, పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ శంకర్ ప్రసాద్ భక్షిలను మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గోమాంగ్ సన్మానించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

'కార్మికులకు న్యాయం చేయాలి'



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: స్థానిక గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లు విశ్రాంత కార్మికులు, మృతి చెందిన కార్మికుల కుటుంబాలు, కార్మికులకు న్యాయం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు కార్మిక భవనంలో సేవా పేపరు మిల్లు శ్రామికుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం ఒక గంట పాటు ఆందోళన జరపనున్నట్లు కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 26వ జాతీయ రహదారి జయపురం బస్టాండ్ ప్రధాన కూడలిలో ఆందోళన జరుపుతామని తెలియజేశారు. అనంతరం ఈనెల 23వ తేదీన రాష్ట్ర విధాన సభ ముందు ధర్నా జరుపుతామన్నారు. కంపెనీ మిల్లు నడిపేందుకు రూ.150 కోట్లకు పైగా ఋణం తీసుకున్నా, ఎందుకు మిల్లును నడపడం లేదని ఆయన ప్రశ్నించారు. ముడి సరుకు, కెమికల్స్, బొగ్గు తీసుకు రాక పోవడంపై ఉన్నత స్థాయి సమీక్ష అవసరమన్నారు. 2012–15 అగ్రిమెంట్ ప్రకారం శ్రామికులకు పూర్తి వేతనం చెల్లించి స్లిప్ అందజేయాల్సి ఉన్నా, పూర్తి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. 2020 నుంచి పేపరు మిల్లును హైదరాబాద్ మదర్ అర్థ కంపెనీ నడుపుతోందని, అయితే నేటి వరకు శ్రామికుల సమస్యలు పరిష్కరింపబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామికుల కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినా మిల్లు యాజమాన్యం నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు.



సమావేశంలో పాల్గొన్న శ్రామికులు

క్లుప్తంగా

ఉగాది ప్రచార రథం ప్రారంభం



ఉగాది ప్రచార రథం ప్రారంభిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక తేజస్వీ హోటల్ ఎదురుగా నున్న మైదానంలో మాజీ ఎంపీ నెక్కంటి ఆధ్వర్యంలో జరగనున్న ఉగాది ఉత్సవాల కోసం ప్రచార రథం ప్రారంభమయ్యింది. నెక్కంటి తనయుడు నెక్కంటి కృష్ణచైతన్య ఈ రథాన్ని ఆదివారం ప్రారంభించారు. పట్టణం లోని కొత్తపేట, మల్లిగాం, కొమట్లపేట, జేకేపూర్ ప్రాంతాల్లో ఉగాది వేడుకలకు సంబంధించిన కార్యక్రమాలు, నిర్వహించే పోటీల గురించి విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈ రథాన్ని వినియోగిస్తామని చైతన్య తెలియజేశారు. అంగరంగ వైభవంగా జరగనున్న వేడుకల్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ కోశాధికారి ఇప్పిలి సన్యాసిరాజు, సభ్యులు వెల్లంకి కిరణ్‌కుమార్, పీవీపీ రాము, బన ఘాటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: తెలుగు సంవత్సరాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని ఖుర్దా రోడ్ తెలుగు సౌరభం సమూహం తీర్మానించింది. ఈ మేరకు స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది రోజున చేపట్టనున్న కార్యక్రమాలను ఖరారు చేశారు. సమూహం మహిళా సభ్యులు పాత్రధారులుగా సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక స్పృహ, ఆచార వ్యవహారాల శీర్షికలతో స్థానిక బీజేబీ రైల్వే ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో మనోరంజక కార్యక్రమాల ప్రదర్శనకు ఏర్పాట్లు దాదాపు పూర్తి అయినట్లు నిర్వాహక వర్గం తెలిపింది.

30 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో టౌన్ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో స్వచ్ఛందంగా యువతీ, యువకులు పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 30 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ అనసూయ మాఝి, రాయగడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్ర పండ, ఏరియా చీఫ్ కో-ఆర్డినేటర్ సత్యవాది పతి, క్లబ్ సభ్యుడు రుబి కుండు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముదులి

రాయగడ: స్థానిక నాగరిక మంచ్ ఆధ్వర్యంలో పట్టణానికి సమీపంలో ఉన్న గుమ్మ పంచాయతీ లెల్లిబడి గ్రామంలో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఎమ్మెల్యే మకరంద ముదులి ముఖ్య అతిథిగా హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంచ్ అధ్యక్షుడు బాదల్ కుమార్ ఝా, డాక్టర్ డీకే మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఏకగ్రీవంగా గెలిచిన సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా లాంబోధర్ తూరక్, వైస్ ప్రెసిడెంట్‌గా జోసెఫ్ జేమ్స్, సెక్రటరీగా నృసింగ్ చరణ్ మొహంత్, జాయింట్ సెక్రటరీగా భభోతోష్ నిశ్వాస్‌లు ఎన్నికయ్యారు. గెలిచిన వారు మాట్లాడుతూ.. సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తామన్నారు.

అన్నదాతకు అండగా..!

- ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పంట సేకరణ కేంద్రాలు
- రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణం
- రైతుల వాటా రూ.3.75 లక్షలే
- రైతు ఉత్పత్తిదార్ల సంఘాలకు యూనిట్లు పొందేందుకు అర్హత



పాతపట్నం మండలంలో సిద్ధమైన పంట సేకరణ కేంద్రం

కవిటి:

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్)తో పంట సేకరణ కేంద్రం(కలెక్షన్ సెంటర్) నిర్మాణానికి జిల్లా ఉద్యానశాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ)లుగా ఏర్పాటు చేయడం ద్వారా అన్నదాతలు సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులు సంఘటితంగా కలెక్షన్ సెంటర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందు కోసం ఉద్యానశాఖ ద్వారా రూ.15 లక్షల నిధులు విడుదల చేయనుంది. ఇందులో 75 శాతం రాయితీ (రూ.11.25లక్షలు) ప్రభుత్వమే భరిస్తుంది. మిగిలిన రూ.3.75 లక్షల నిధులు రైతు సంఘాలు సమీకరించుకుని యూనిట్ నిర్మాణం చేయాలి.

ఇవీ ఉపయోగాలు..

- రైతులు తమ పంట ఉత్పత్తుల్ని ఈ కేంద్రాలలో నిల్వచేసుకోవాలన్నది ప్రధాన లక్ష్యం.
- ధరలు తగ్గుముఖం పట్టిన సందర్భాల్లో ఇక్కడ పంట నిల్వచేసుకొని రైతులంతా సంఘటితంగా ఉంటూ దళారుల ప్రమేయం లేకుండా అమ్మకాలు చేయవచ్చు. అవసరమైతే వినియోగదారుడే ఈ సెంటర్‌కు వచ్చి తమకు నచ్చిన నాణ్యమైన పంటల్ని కొనుక్కోవచ్చు.
- జిల్లా వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులో ఉన్న నిధుల మేరకు 28 యూనిట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మంజూరు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయిలో విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.
- లింటల్ లెవెల్ వరకు నిర్మాణం పూర్తిచేస్తే యూనిట్ ధరలో 50 శాతం నిధులు విడుదలచేస్తారు. నిర్మాణం ముగిసిన తర్వాత మిగిలిన 50 శాతం నిధులు అందిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉన్నత ఆశయంతో ఉద్యాన శాఖ పంట సేకరణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌లో నిధుల సౌలభ్యాన్ని దృష్టిలోపెట్టుకుని 28 యూనిట్లు మంజూరు చేశారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

– రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, శ్రీకాకుళం

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని ఆదివారం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా లింగా స్వరగ గ్రామానికి చెందిన ముకుంద నాయక్, ఉద్రిపడర్ గ్రామానికి చెందిన భంబో మాలిక్‌లు కలిసి పోయిపడగడ గ్రామానికి చెందిన ఐబోరైతో వద్ద 25 కేజీల గంజాయిని కొనుగోలు చేసుకుని ద్విచక్రవాహనంపై బయలుదేరారు. పాతపట్నం, హిరమండలం మీదుగా ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడలో ఉంటున్న రమోరైతోకు అమ్మాలని నిర్ణయించారు. పాతపట్నం సరిహద్దు చెక్‌పోస్ట్‌లో ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండటంతో వీరిద్దరూ పట్టుబడ్డారు. కార్యక్రమంలో వీఆర్వోలు బాలరాజు, పార్థసారధి, సిబ్బంది పాల్గొన్నారు.

చాకచక్యంగా మొబైల్ ఫోన్ చోరీ



సీసీ టీవీ ఫుటేజీలో నమోదైన చోరీ దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని సాయిరాం మెడికల్ షాపునకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బద్రి మిన్నారావుకు చెందిన సెల్‌ఫోన్‌ను చాకచక్యంగా దొంగిలించాడు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకొంది. ఓ వ్యక్తి మూగవాడినని చెప్పి కొన్ని కాగితాలను చూపిస్తూ కౌంటర్ మీద ఉన్న మొబైల్ ఫోన్‌ను ఆ కాగితాలు అడ్డుగా పెట్టుకొని దొంగిలించి అక్కడి నుంచి ఉడాయించాడు. కొంతసేపటి తర్వాత తన మొబైల్ పోయిందని గుర్తించిన మిన్నారావుకు ఏం జరిగిందో అర్థం కాలేదు. షాపులో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించడంతో సదరు వ్యక్తే మొబైల్‌ను దొంగిలించిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే బయటకు వచ్చి చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి



నూకయ్య (ఫైల్)

గార: మండలంలోని కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలపల్లి నూకయ్య (72) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తన ఇంటి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయమై ఎస్ఐ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

'చలో విజయవాడ' భగ్నం



కాశీబుగ్గ: కాంగ్రెస్ పిలుపు మేరకు సోమవారం జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరేందుకు సిద్ధమైన పలాసకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను కాశీబుగ్గ పోలీసులు నిలువరించారు. కాంగ్రెస్ నేతలు తంగుడు వీర్రాజు, తెంబూరు మధుసూదన్, మాదిన వెంకటరమణ, సాసుమాన శ్యామ్ తదితరులను పలాస రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్సులకు వెళ్లకుండా సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో అదుపులోకి తీసుకుని కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అట్రాసిటీ కేసు నమోదు

నందిగాం: మండలంలోని రౌతుపురం గ్రామానికి చెందిన పోలాకి ఎర్రయ్యను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన శివరాంపురం గ్రామానికి చెందిన లండ రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. బాధితుడు ఎర్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి క్షేత్ర సహాయకునిగా పని చేస్తున్న ఎర్రయ్య నందిగాం కార్యాలయానికి వెళ్లేందుకు శుక్రవారం బైక్‌పై వస్తుండగా రౌతుపురం జగనన్న కాలనీ వద్ద రామారావు రోడ్డుకు అడ్డంగా బైక్ పెట్టి ఉన్నాడు. హారన్ కొట్టినా బైక్ తీయకపోవడంతో పక్కనుంచి వెళ్లిపోతుండగా హారన్ ఎందుకు కొట్టావని కులం పేరుతో తిట్టాడు. తననుఎందుకు తిడుతున్నావని అడగ్గా ఎర్రయ్యపై దాడికి పాల్పడి చెవి కొరకడంతో తీవ్ర రక్త స్రావమైంది. దీంతో ఎర్రయ్య టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నందిగాం ఎస్సై కేసు నమోదు చేశారు. బాధితున్ని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు పరామర్శించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

గడ్డివాము దగ్ధం



కాలిపోతున్న గడ్డికుప్ప

నందిగాం: మండలంలోని హరిదాసుపురంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన కణితి జయరాం స్థానిక శివాలయం సమీపంలోని తన కల్లంలో పంట నూర్చి గడ్డికుప్ప వేశారు. సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో గడ్డికుప్ప కాలిబూడిదైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. సమాచారం అందుకున్న టెక్కలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

తొమ్మిది మంది జూదరులపై కేసు

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని వాంబేకాలనీలో తొమ్మిది మంది పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ. 49,670 నగదును స్వాధీనం చేసుకుని అదుపులో తీసుకున్నామని, కేసు నమోదు చేశామని ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు.

చీపురుపుల్లలే జీవనోపాధి





పూతిక చీపురు పుల్లలు సేకరిస్తున్న గిరిజన మహిళ

- కొండపోడు పంటతో అదనపు ఆదాయం
- 16 గిరిజన మండలాల్లో చీపుర్ల సాగు

ఎల్.ఎన్.పేట: చీపురుపుల్లలు వేలాది మంది గిరిజన కుటుంబాలకు, వ్యాపారులకు జీవనాధారం కల్పిస్తున్నాయి. అడవులు, కొండ పోడుల్లో సేకరించిన చీపురు పుల్లలే గిరిజన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గుర్తింపు పొందిన 20 గిరిజన మండలాల్లో సుమారు 2 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరంతా కొండపోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పంటలు, సహజ సిద్ధంగా లభించిన వివిధ రకాల ఉత్పత్తులను అమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. అందులో చీపుర్లు కూడా జీవనోపాధి కల్పిస్తున్నాయి. చీపుర్లలో కొండచీపుర్లు, పూతిక చీపుర్లు అనే రకాలున్నాయి. ఒకప్పుడు పూతిక చీపుర్ల వినియోగం ఎక్కువగా ఉండేది. కొండ చీపుర్లు రాకతో పూతిక చీపుర్లు కనుమరుగైపోయాయి. గిరిజన మహిళలు కొండల్లో తిరిగి పూతిక చీపురుపుల్లలను సేకరిస్తారు. వీటిని ఇంటికి తీసుకుని వచ్చి ఎండబెడతారు. ఇలా ఎండిన పుల్లలను కట్టలుగా కట్టి విక్రయానికి తీసుకుని వెళ్తారు. పూతిక చీపురు కట్ట రూ.20కు అమ్ముతారు. వీటికి గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ గిరాకీ ఉంది. ఇక కొండ చీపురులను గిరిజనులు పోడు పంటగా నాటుతారు. సుమారు ఎనిమిది నెలలకు కొండ చీపురు పుల్లలు కోతకు వస్తాయి. కొండ చీపురు కట్టలు రూ.40 నుంచి రూ.50కు అమ్ముతున్నారు. గ్రామాల నుంచి పట్టణాల్లో ఉన్న చిన్న కిరాణా దుకాణం నుంచి పెద్దపెద్ద డిపార్ట్‌మెంట్ స్టోర్స్, మాల్స్ వంటి వ్యాపార సంస్థల్లోను కొండ చీపుర్లు అమ్మకానికి సిద్ధంగా ఉంటాయి.

జిల్లాలోని సాగు మండలాలు

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం 16 గిరిజన మండలాలు ఉన్నాయి. వీటిలో మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, ఎల్.ఎన్.పేట, హిరమండలం, సారవకోట, నందిగాం, మందస, బూర్జ, సరుబుజ్జిలి తదితర మండలాల్లో సుమారు 28వేల గిరిజన కుటుంబాల వారు పోడు పంటగా కొండ చీపుర్ల సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో కొండ చీపుర్లు సాగు చేస్తే సుమారు 2 వేల చీపురు కట్టలకు అవసరమయ్యే పుల్లల దిగుబడి వస్తాయి. కట్ట రూ.40కు విక్రయించుకున్నా రూ.80వేలు ఆదాయం వస్తుంది.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత



ఆర్‌పీఎఫ్ సమక్షంలో ప్రయాణికుని ఫోను అందజేస్తున్న సీటీఐ లక్ష్మీధర మహంతి

భువనేశ్వర్: రైలులో టికెట్ తనిఖీ సిబ్బంది సహకారంతో ప్రయాణికుడు చేజార్చుకున్న మొబైల్ ఫోను తిరిగి పొందాడు. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న 12704 నంబర్ డౌన్ ఫలక్‌నుమా సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో ప్రయాణించిన ఎస్.మహరణ తొందరపాటులో మొబైల్ ఫోను బెర్తుపై విడిచిపెట్టి ఖుర్దారోడ్ రైల్వే స్టేషనులో దిగారు. ఫోను విషయం గుర్తుకు వచ్చే సమయానికి రైలు బయల్దేరడంతో ఖుర్దారోడ్ ప్లాట్ ఫామ్ మీద టికెటు తనిఖీ లాబీ వర్గాల ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ఉన్న సీనియర్ సీటీఐ లక్ష్మీధర మహంతికి సమాచారం చేరదీశారు. ఈ అధికారి తక్షణమే గాలించి మరో ప్రయాణికుని దగ్గర మొబైల్ ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భువనేశ్వర్ రైల్వేస్టేషనులో రైల్వే రక్షక దళం అధికారుల సమక్షంలో ప్రయాణికుడి బంధువుకు ఫోన్ అందజేశారు. రైలు ప్రయాణంలో అత్యవసర పరిస్థితుల్లో విధి నిర్వహణలో ఉన్న టికెట్ తనిఖీ సిబ్బందిని సకాలంలో సంప్రదించి సముచిత సేవలు పొందే దిశలో ప్రయాణికులను చైతన్యపరచడం అవసరమని లక్ష్మీధర మహంతి తెలిపారు.

గొర్రెలు మృత్యువాతపై విచారణ



గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

సంతబొమ్మాళి: వ్యాక్సిన్ వికటించి 15 గొర్రెలు మృతి చెందిన విషయమై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. టెక్కలి పశుసంవర్ధకశాఖ ఏడీ రఘునాథ్, శ్రీకాకుళం ఏడీ కిషోర్‌లు ఆదివారం పాలతలగాం వెళ్లి మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రి అప్పన్నకు చెందిన గొర్రెలకు సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ స్రవంతి ఇచ్చిన షీప్ పాక్స్ వ్యాక్సిన్ మరొక వ్యక్తి వేయడంతో 15 గొర్రెలు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. సిబ్బంది వ్యాక్సిన్ వేయకుండా యాజమానులకు ఇవ్వడంపై అధికారులు మండిపడ్డారు. అస్వస్థతకు గురైన గొర్రెలకు ఐదు రోజుల పాటు చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీ తెలిపారు. పోస్టుమార్టం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కాగా, 15 గొర్రెలు మృతి చెందడంతో సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు.

అపూర్వ సమ్మేళనం



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–83 మధ్య ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలిసి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకొని అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు ప్రకాశరావు, తవిటయ్య, మోహనరావులను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మామిడి క్రాంతి, వి.వి.రాజు, నరేంద్ర, మాధవ తదితరులు పాల్గొన్నారు. – నరసన్నపేట

తమ్ముడిపై అన్న దాడి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 12వ వార్డు పల్లివీధికి చెందిన జోగి చంద్రశేఖర్‌పై అతని సోదరుడు జోగి మన్మధరావు ఇంటి విషయమై వచ్చిన తగాదాలో దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కింద అంతస్తులో తాను మరమ్మతులు చేయిస్తుంటే పైఅంతస్థులో ఉన్న అన్నయ్య తరచూ ఇబ్బందులు పెట్టేవాడని, గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా ఆదివారం దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కాగా, పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జోగి చంద్రశేఖర్‌ను వార్డు కౌన్సిలర్ ఉమాహరిప్రసాద్, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, టెక్కలిపట్నం సర్పంచ్ పానిల కృష్ణారావు, మాజీ కౌన్సిలర్ బదకల పులిరాజు పరామర్శించారు.

విద్యార్థులకు తల్లిదండ్రుల దీవెన



పెద్దపాడు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఆదివారం కన్నవారి దీవెనలు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ యశోద లక్ష్మి ఈ కార్యక్రమం నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తల్లిదండ్రుల దీవెనలు పొందారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. – శ్రీకాకుళం రూరల్

సాంకేతికతను ఉపయోగించుకోవాలి



సెమినార్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

శ్రీకాకుళం: వైద్య విద్యలో నూతన టెక్నాలజీని విద్యార్థులు ఉపయోగించుకోవాలని రిమ్స్ హెడ్ ఆఫ్ ఎనస్థీషియాలజీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి(రిమ్స్) మెడికల్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనస్థీషియాలజీ ఆధ్వర్యంలో లాప్రోస్కోపిక్ సర్జరీలు, చెవి, ముక్కు గొంతు సర్జరీలలో ఆదివారం జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం నిరంతరం విద్యార్థులనే తలపిస్తుందన్నారు. వైద్య రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనస్థీషియా విభాగం ప్రొఫెసర్లు రంగనాథం, శిరీష, వైద్యులు బాను, అచ్యుతరావు, జాయింట్ కార్యదర్శి రంగనాథ్, ప్రసాద్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కోటి లింగేశ్వరాలయానికి రూ.1.34 కోట్ల వితరణ



దున్న గురుమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: చారిత్రక ప్రాధాన్యత కలిగిన బారువ కోటిలింగేశ్వర ఆలయం గర్భగుడి, అంతరాలయాన్ని పవిత్రమైన కృష్ణశిలతో నిర్మించేందుకు అవసరమైన రూ.1.34 కోట్ల నిధులను భరించేందుకు అదే గ్రామానికి చెందిన దున్న గురుమూర్తి దంపతులు ముందుకువచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో దాతను స్థానిక సర్పంచ్ యర్ర రజనీ, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. సుదీర్ఘకాలంగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న శివాలయం నిర్మాణ ఖర్చును భరించేందుకు గురుమూర్తి ముందుకురావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడ్రాల శ్రీనివాస్, ఎంపీటీసీ తామాడ విశ్వనాథం, మద్ది చంద్రశేఖర్, రాజేష్ ఖన్నా, గుడ్రాల సత్యం, భువనేశ్వర్ ప్ర

క్లుప్తంగా

జీడి తోటలు దగ్ధం


కాలిపోయిన తోటలు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఆదివారం పలువురు రైతులకు చెందిన జీడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. పాదచారులు సిగరెట్లు కాల్చి పడేయడంతోనే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఆరుగాలం కష్టించి పెంచుకున్న తోటలు పంటకు చేతికందే వచ్చే సమయంలో కాలిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు కొప్పర పుణ్యవతి, బుడుమూరు సూరయ్య, వి.జనార్దన్‌తోపాటు మరో తొమ్మిది మంది వాపోతున్నారు. సుమారు 15 ఎకరాల తోటలు కాలిపోతున్న విషయం తెలుసుకున్న పాలకొండ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు.

145 మద్యం బాటిల్స్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌ను చూపిస్తున్న సీఐ లక్ష్మణరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: స్థానిక లంకాపట్నంలో అక్రమంగా నిల్వచేసిన 145 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. లంకాపట్నంలో అక్రమంగా మద్యం బాటిల్స్ నిల్వచేసి అమ్మకాలు చేస్తున్న విషయం తెలుసుకుని, నిఘా పెట్టామన్నారు. ఈ నేపథ్యంలో చేసిన తనిఖీల్లో మద్యం నిల్వచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బోర్ల వైర్లు చోరీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో బోర్ల వైర్లను కత్తిరించి చోరీచేయడంపై గ్రామానికి చెందిన రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు 18నుంచి 20 మంది వరకు రైతుల బోర్ల వైర్లు కోసేశారని, వాటిని తస్కరించిన వారిని పట్టుకునేందుకు ప్రయతిస్తున్నామని తెలిపారు. దీనిపై గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిర్ణయించారు.

రెండు దుకాణాలు దగ్ధం



శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ -అరకు రోడ్డులో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో రెండు దుకాణాల యజమానులు నష్టపోయారు. స్థానిక షిర్డీ సాయి బాబా గుడి పక్కన ఉన్న చెత్తకు ఉదయం 6గంటల సమయంలో ఎవరో నిప్పు అంటించారు. దీంతో చెత్త కాలడంతో పాటు పక్కనే ఉన్న ఆటోమొబైల్ షాపులో ఉన్న ఆయిల్స్, టైర్లు తదితర వస్తువులు అంటుకున్నాయి. అలాగే అదే ప్రాంతంలో గణేష్ నడుపుతున్న ఏసీ, ఫ్రిజ్‌ల మెకానిక్ షాపునకు కూడా మంటలు వ్యాపించడంతో దుకాణంలో ఉన్న సామగ్రి కాలిపోయింది, దుకాణాల్లో ఉన్న సామగ్రి మొత్తం కాలిపోయి నష్టపోయామని బాధితులిద్దరూ గగ్గోలు పెట్టారు. ప్రమాద వార్త తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

అండర్ - 19 క్రికెట్ జట్టు ఎంపికలకు స్పందన


క్రికెట్ జట్టు ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ - 19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు స్పందన లభించింది. నగర శివారుల్లోగల సర్ విజ్జీ స్టేడియంలో ప్రాంగణంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఎంపి క పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 90 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వ్యక్తిగత సామర్థ్య పరీక్షలు నిర్వహించగా... ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను రానున్న రెండు రోజుల్లో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.

చెరకు రైతుకు ఊరట


కర్మాగారానికి తరలించేందుకు చెరకును నరుకుతున్న రైతులు

- జిల్లాల విభజన అనంతరం సంకిలి ఫ్యాక్టరీకి కొత్త లక్ష్యం
- ఈ ఏడాది లక్ష్యం 4,52,100 టన్నులు
- ఇంతవరకూ సేకరించింది 3,27,708 టన్నులు
- మరో లక్ష టన్నులు సేకరించే అవకాశం
- మూడు జిల్లాల్లో 19,800 ఎకరాల్లో సాగు


తెర్లాం సమీపంలో చెరకు సాగు

జోన్ల వారీగా సేకరించిన చెరకు వివరాలు

ఎన్‌సీఎస్ పరిధిలో	:	74,585 టన్నులు
భీమసింగి పరిధిలో	:	11,432 టన్నులు
ఫ్యాక్టరీ పరిధిలో	:	2,41,691 టన్నులు

ఐదేళ్లుగా మద్దతు ధర..

సంవత్సరం	-	మద్దతు ధర (రూపాయల్లో)
2018-2019	-	2,750
2019-2020	-	2,750
2020-2021	-	2,800
2021-2022	-	2,900
2022-2023	-	2,980

రేగిడి: ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో మూడు జిల్లాల చెరకు రైతులకు ఊరట లభించింది. గతంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సంకిలి చక్కెర కర్మాగారం ఒక్క ఆ జిల్లాలో చెరకు రైతులకు మాత్రమే బాసటగా ఉండేది. గత ప్రభుత్వాలు చెరకు సాగుపై దృష్టిసారించలేదు. సాగుచేసే రైతును పట్టించుకోలేదు. ఫలితంగా ఒక్క రేగిడి, పాలకొండ, రాజాం, వీరఘట్టం, ఆమదాలవలస తదితర ప్రాంతాల చెరకు రైతులు మాత్రమే సంకిలి సుగర్స్ ద్వారా లబిపొందేవారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని భీమసింగి, బొబ్బిలి సర్కిల్‌లోని సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అక్కడి ఫ్యాక్టరీలు మూతపడడంతో రైతులు ఇక్కడి ఫ్యాక్టరీకి చెరకును తీసుకురాలేక చాలా అవస్థలు పడేవారు. ఇక్కడి నుంచి చెరకు కటింగ్ ఆర్డర్లు ఆ ప్రాంత రైతులకు వచ్చేవి కాదు.

ప్రభుత్వ విధానంతో పెరిగిన సాగు

జిల్లా విభజన అనంతరం సంకిలిలోని ఈఐడీ ప్యారీ సుగర్స్ ఫ్యాక్టరీ విజయనగం జిల్లా పరిధిలోకి వచ్చింది. అంతేకాకుండా చెరకు రైతును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. కర్మాగారం యాజమాన్యంతో మాట్లాడి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని చెరకు రైతుల దగ్గర చెరకును తీసుకునేలా ఒప్పించింది. దీంతో ఈ కర్మాగారం పరిధిలో తగ్గుతూ వచ్చిన చెరకు సాగు పెరిగింది. గతంలో ఒక్క శ్రీకాకుళం జిల్లా పరిధిలో సంకిలి పరిసర ప్రాంతాల్లో 8 వేల హెక్టార్ల వరకూ మాత్రమే చెరకు సేకరణ జరిగేది. ఈ ఏడాది ఈ మూడు జిల్లాల్లో మొత్తం 19,800 ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేస్తుండగా భీమసింగి, బొబ్బిలి, సంకిలి జోన్‌ల పరిధిలో 16,200 వేల ఎకరాల్లోని చెరకును ఫ్యాక్టరీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది చెరకు సేకరణ లక్ష్యం 4,52,100 టన్నులుగా నిర్దేశించగా ఇప్పటివరకు 3,27,708 టన్నుల చెరకును సేకరించింది. మరో నెలరోజులు పాటు క్రషింగ్ ఉండడంతో మరో లక్ష టన్నుల చెరకును సేకరించే అవకాశం కూడా ఉందని ఫ్యాక్టరీ యాజమాన్యం వెల్లడించింది. గతంలో కంటే ఈ ఏడాది లక్ష్యం పెరగడంతో ఫ్యాక్టరీ కూడా క్రషింగ్‌ను పెంచి రైతులకు బాసటగా నిలిచింది.

సకాలంలో చెల్లింపులు

ప్యారీ కర్మాగారం చెరకు రైతును ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ ఫ్యాక్టరీకి తరలించిన చెరకుకు రూ.82.80 కోట్లు రైతులకు చెల్లించింది. మరో రూ.10 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. మార్చి నెలాఖరునాటికి మిగిలిన రూ.10 కోట్లు చెల్లించే ఏర్పాట్లు చేసింది. అంతేకాకుండా చెరకు మద్దతుధర టన్నుకు రూ.2980లు కాగా మరో రూ.100లు అదనంగా ఫ్యాక్టరీ చెల్లిస్తోంది. ఎకరా సాగులో 35 నుంచి 40 టన్నుల మేర చెరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. చెరకు నాటే రైతులకు ముందుగా విత్తనాలు, మధ్యలో ఎరువుల పంపిణీని కర్మాగారం చేపడుతోంది. ఈ ఏడాది మూడుజిల్లాల పరిధిలో మొత్తం 9,500 మంది రైతులు లబ్ధి పొందారు.


సంకిలి ప్యారీ సుగర్స్ ఫ్యాక్టరీ

రైతుకు అన్ని విధాలా భరోసా



రైతు బాగుండాలి, కర్మాగారం బాగుండాలి అనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నాం. మమ్మల్ని నమ్మి చెరకు సాగు చేస్తున్న రైతుకు నష్టం లేకుండా చూస్తున్నాం. కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన 14 రోజుల్లోనే నేరుగా రైతు ఖాతాలో నగదు జమ చేస్తున్నాం. ఈ ఏడాది మా కర్మాగారంతో పాటు భీమసింగి, బొబ్బిలి ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీ జోన్‌ల పరిధిలో పక్క జిల్లాల రైతులు కూడా మా కర్మాగారానికే చెరకు సరఫరా చేశారు. మొత్తం 12 వేల హెక్టార్లలో చెరకును ఈ ఏడాది క్రషింగ్ చేశాం.

– ఏవీ నాగేశ్వరరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం, సంకిలి

తల్లీకూతుళ్లపై దాడి


గ్రామంలో గొడవ జరుగుతున్న దృశ్యం

- తొమ్మిదిమందిపై కేసు నమోదు

వంగర: మండల పరిధి నీలయ్యవలస గ్రామంలో తల్లీకూతుళ్లపై మహిళలపై అదే గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఆదివారం దాడికి పాల్పడినట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రీసి అన్నపూర్ణ ఇంటి ఆవరణలో గ్రామస్తులు కొంత మంది వ్యక్తులు చెత్త పారబోశారు. తమ ఇంటి వద్ద ఎందుకు చెత్తవేస్తున్నారని ఆమె ప్రశ్నించగా గొండేల సత్యం, మరికొంత మంది ఆమెను కొంత దూరం ఈడ్చుకువెళ్లారు. ఎందుకు ఇలా చేస్తున్నారని ఆమె కుమార్తె ఈశ్వరమ్మ (మద్దువలస సచివాలయం హెల్త్ సెక్రటరీ) అడ్డుపడగా..ఆమెను కూడా విచక్షణా రహితంగా కొట్టి కాళ్లతో తన్నినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు గొండేల సత్యంతో పాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వర రావు తెలియజేశారు.

వాలీబాల్ నూతన అసోసియేషన్ ఏకగ్రీవం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.సూరిబాబు (కొత్తవలస), కేవీఏఎస్ రాజు, కోశాధికారిగా కె.సన్యాసి నాయుడుతో పాటు మరో 23 మందితో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు జిల్లా వాలీబాల్ సర్వసభ్య సమావేశం పూర్వ అధ్యక్షుడు కృష్ణంరాజు అధ్యక్షతన ఆదివారం సిటీ క్లబ్‌లో జరిగింది. కార్యదర్శి నివేదికను జిల్లా పూర్వ కార్యదర్శి భగవాన్ దాస్ ప్రవేశ పెట్టా రు. అనంతరం ఏకగ్రీవంగా 25 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్ రాజు మాట్లాడుతూ విజయనగరం జిల్లా వాలీబాల్ జట్టుతో ఆడలంటే రాష్ట్రంలో అన్ని జట్లు ప్రణాళిక వేయకుండా తలబడే పరిస్థితి లేదన్నారు. ఆ స్థాయికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్‌ను తీసుకెళ్లడం జిల్లాలో ఉన్న వాలీబాల్ ప్రేమికుల సహకారం వల్ల సాధ్యమైందమన్నారు. అనంతరం ఇంతవరకు అసోయేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న కృష్ణంరాజు, భగవాన్ దాస్ లు బాధ్యతల నుంచి రిలీవ్ అయిన సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో శాప్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శ్రీనివాసరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, సీఐ బాలకృష్ణ, కనకల.కృష్ణ, సాంబ, సీనియర్ క్రీడాకారులు, వాలీబాల్ అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సీతానగరం: వేసవి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు బోర్ల మరమ్మతులు చేపట్టినట్లు మెకానిక్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కాంట్రాక్ట్ బోర్ మెకానిక్ నిర్వహించిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 478 మంచినీరుబోర్లున్నాయని, వేసవి కాలం రావడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజావసరాలను పరిగణనలోకి తీసుకుని ముందుగా బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. అన్నిగ్రామాల్లో బోర్ల మరమ్మతులు నిర్వహించడానికి అవసరమైన ముడి సరుకు రావలసి ఉందన్నారు. అలాగే మంచినీటి పైప్‌లు, గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో ఇంటింటి కుళాయి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు అందిన రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.


జోగింపేటలో బోరుమరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

పార్వతీపురం: రోడ్డుపై ఉన్న కంకర రాళ్లు తీయనందుకు డ్రైవర్, హెల్పర్‌లు ముగ్గురిని గాయపరిచారు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా వున్నాయి. గరుగుబిల్లి మండలం దళాయివలసకు చెందిన సీహెచ్. చంద్రమౌళి తన ఇంటికి శ్లాబ్ పనులు నిర్వహించాడు. శ్లాబ్ పనులు పూర్తి కాగా మిగిలిన రాయి, ఇసుక రోడ్డుకు అడ్డగా ఉన్నాయి. ఇంతలో ఆ రోడ్డుమీదుగా ఓ వ్యాన్ రాగా రోడ్డుపై ఉన్న కంకర తీయాలని డ్రైవర్ అగిగాడు. భోజనం తినేసిన తరువాత తీస్తానని మౌళి తెలిపాడు. దీంతో ఇద్దరి మధ్య ఈ విషయంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. అదికాస్తా ముదిరి తోపులాట జరిగింది. దీంతో డ్రైవర్ శంకరరావు, క్లీనర్‌లు చంద్రమౌళి చొక్కాపట్టుకుని లాక్కెళిపోయాడు. అదేమని చంద్రమౌళి తండ్రి ఉమామహేశ్వరరావు, డ్రైవర్, క్లీనర్‌లను అడగ్గా ఆయనను కూడా దుర్భాషలాడి నుదుటిపై, కన్నుపై గాయపరిచారు. ఈగొడవను విడిపించడానికి వచ్చిన చంద్రమౌళి చెల్లి సంతోషికుమారిని కూడా ఇసుకలో పడదోసి కొట్టారు. దీంతో కుటుంబంలో గాయాల పాలైన ముగ్గురూ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కుడుబద్రలో ఏనుగుల విధ్వంసం

భామిని: మండలంలోని మనుమకొండలో తిష్ట వేసిన ఆరు ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి విధ్వంసం సృష్టించాయి. కొత్తూరు గూడ మీదుగా పక్కుడుబద్ర సమీపానికి చేరుకొని జీడి, మామిడి తోటలపై తమ ప్రతాపం చూపాయి. కాట్రగడ-బీకి చెందిన తోట సింహచలం, తోట శాంతికుమారిలకు చెందిన జీడి, మామిడి తోటలలో తీవ్ర నష్టం కలిగించాయి. జీడి పంటకు తీవ్ర నష్టం కలిగించాయి. పంట చేతికి వచ్చే తరుణంలో ఏనుగులు గుంపు కలిగించిన నష్టాలపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాలను అటవీ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. .

పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

సీతానగరం: మండలంలోని పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి, వెలుగుద్వారా బీమా సౌక ర్యం కల్పించడానికి వీఓలు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీఎం ఆర్.శ్రీరాములు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల సమాఖ్య కార్యాలయంలో వీఓల తో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శ్రీ నిధి ద్వారా బ్యాంకు రుణాలు పొందిన వారు సకాలంలో వాయిదాలు చెల్లించేలా వీఓలు చర్యలు చేపట్టాల ని కోరారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సీసీల పర్య వేక్షణలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పా రు. పీఎం ఎస్‌బీవై పథకం ద్వారా 18 సంవత్సరాల వయస్సు నుంచి 70 సంవత్సరాలలోపు ఉన్న బ్యాంక్ ఖాతాదారులకు వార్షిక ప్రీమియం రూ.20 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రీమియం చెల్లించిన వారికి రూ 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంద ని తెలిపారు. అలాగే పీఎంజేజేబీవై పథకం ద్వారా వార్షిక ప్రీమియం రూ.436 చెల్లించిన వారికి బీమా రూ.2లక్షలు వర్తిస్తుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు



రాజాం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

- సురక్షితనీటిని అందిస్తున్న ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలు, గర్భిణులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తొలివిడతగా ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. దశల వారీగా మిగతా కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేయనుంది.

220 కేంద్రాల్లో ప్లాంట్ల ఏర్పాటు

జిల్లాలో తొలివిడతలో ప్రాజెక్టుకు 20 కేంద్రాలు చొప్పన 220 కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే పిల్లలకు నీరు అందిస్తున్నారు.

సురక్షిత నీరు అందజేత

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. ఈ ప్లాంట్ల ద్వారా పిల్లలు, గర్భిణులకు సురక్షిత నీటిని అందించనున్నాం.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి

ఆన్‌లైన్ ప్రదర్శనకు బొండపల్లి విద్యార్థి ప్రాజెక్టు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన షర్మిల గాయత్రి ప్రాజెక్టు

బొండపల్లి: ఇన్‌స్పైర్ అవార్డుల కోసం 10 వతరగతిలోపు విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఎస్‌ఐఎఫ్ న్యూఢిల్లీ వారు శనివారం నిర్వహించిన అన్‌లైన్ విజ్ఞాన ప్రదర్శనలలో బొండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రదర్శన రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. మండలంలోని ముద్దూరు పంచాయతీ తమటాడ గ్రామానికి చెందిన కొండా షర్మిల గాయత్రి బొండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 9 వతరగతి చదువుతూ అన్‌లైన్ పోటీల్లో పాల్గొని ప్రదర్శన ఇచ్చినట్లు హెచ్‌ఎం టి.సన్యాసిరాజు తెలిపారు. తమ విద్యార్థిని ప్రదర్శించిన (ద థర్డ్ ఐ ఫర్ బ్లెండ్ పీపుల్) విజ్ఞాన ప్రాజెక్టు రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికైనట్లు సంతోషం వెలిబుచ్చారు. ఈ విద్యార్థిని గత ఏడాది ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచి ఉపకార వేతనానికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని గైడ్ జి.రాజశేఖర్‌తో పాటు గ్రామ సర్పంచ్ మునకాల పైడిపు నాయుడు, ఉపాధ్యాయులు ఆమెను ఈ సందర్భంగా అభినందించారు.

పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు

- డీఎస్పీ మోహన రావు


మాట్లాడుతున్న డీఎస్పీ మోహన రావు

బొబ్బిలి: సబ్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఉందని, ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు డీఎస్పీ బి మోహన రావు తెలిపారు. ఈ మేరకు బొబ్బిలిలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఒక డీఎస్పీ,14 మంది సీఐలు, 21 మంది ఎస్సైలు, 20మంది ఏఎస్సైలు,105 మంది కానిస్టేబుళ్లు, 95 మంది హోం గార్డులను నియమించినట్టు చెప్పారు. అలాగే చీపురుపల్లి సబ్ డివిజన్‌లో ఒక ఏఎస్పీ, ఒక డీఎస్పీ, సీఐలు14 మంది, ఎస్సైలు 21 మంది, ఏఎస్సైలు 20 మంది, కానిస్టేబుళ్లు 105 మంది,95 మంది హోం గార్డులను నియమించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


చిన్నికోటి రాంబాబు(ఫైల్)


రాము మృతదేహం

భోగాపురం: మండలంలోని పెద్దకవుల వాడ గ్రామానికి చెందిన చిన్నికోటి రాంబాబు(34) అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం మాధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై మృతుని బంధువులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబాబు ఆటో నడుపుకుంటూ కుటుంబజీవనం సాగిస్తున్నాడు. భార్య వరలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమధ్య కాలంలో మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య వరలక్ష్మి భర్తతో ఘర్షణ పడి తోటికోడలితో కలిసి పక్కనే ఉన్న ఉప్పిలి అప్పలసూరి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో సుమారు 12 గంటల సమయంలో పొదుపు డబ్బులు అడగడానికని చెప్పి గ్రామానికి చెందిన అంకయ్యమ్మ రాంబాబు ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో ఉరివేసుకుని దులానికి వేలాడుతూ రాంబాబు కనిపించడంతో కేకలు వేసింది. దీంతో పక్క ఇంట్లోనే ఉన్న భార్య వరలక్ష్మితో పాటు చుట్టు పక్కల వారు వచ్చి రాంబాబును కిందికి దించి హుటాహుటిన తగరపువలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పెద్దగెడ్డలో దూకి మరొకరు..

పాచిపెంట: మండలంలోని పెద్దగెడ్డజలాశయంలో దూకి ఓవ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న సాలూరు పట్టణానికి చెందిన పెంటరాము మద్యానికి బానిసయ్యాడు, భర్త మద్యానికి బానిస అవడంతో భరించలేని భార్య మూడునెలల కిందట కన్నవారింటికి వెళ్లిపోయింది. అయితే ఇటీవల రాము మద్యం మత్తులో భార్య వద్దకు వెళ్లి ఇంటికి రావాలని కోరాడు, మద్యం మానివేస్తేనే వస్తానని, లేకపోతే రానని తెగేసి చెప్పింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన రాము ఆదివారం ఉదయం మళ్లీ మద్యంమత్తులో భార్య వద్దకు వెళ్లగా మళ్లీ అదే సమాధానం చెప్పింది. దీంతో వరసకు సోదరుడైన చంటి అనే వ్యక్తిని పాచిపెంటలో పని ఉందని చెప్పి రాము తీసుకువచ్చాడు, శివాలయం సమీపంలో చంటిని ఉండమని చెప్పి ఫోన్ మాట్లాడుకుంటూ జలాశయం దగ్గరకు వెళ్లి దూకేశాడు. అదిచూసిన చంటి పెద్దగా అరిచి స్థానికులకు విషయం చెప్పడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఈతగాళ్ల సహాయంతో రామును బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.

టెన్త్, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి


బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులను అభినందిస్తున్న జేఎస్ రమణమూర్తి

- గిరిజన గురుకులాల రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణమూర్తి

సీతంపేట: టెన్త్, ఇంటర్మీడియెట్‌లలో మెరుగైన ఫలితాలు సాధించాలని గిరిజన గురుకులం సొసైటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రమణమూర్తి తెలిపారు. స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, బాలుర స్కూల్, కాలేజీలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో ఆశయంతో ఇక్కడ మిమ్మల్ని చదివిస్తున్నారని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రభుత్వం అనేక సదుపాయాలు మీకు చదువుకోవడానికి కల్పిస్తుందన్నారు. ఉచిత వసతి, విద్య అందిస్తుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల వివరాలు, ఖాళీలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఆయా విద్యా సంస్థల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్ లేదని, మంచినీటి సమస్య ఉందని బాలికల కళాశాల సిబ్బంది తెలిపారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తమకు వేతనాలు పెంచకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, చాలీచాలని వేతనాలతో నెట్టుకువస్తున్నామని, ఇప్పటికైనా న్యాయం చేయాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు జేఎస్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట కన్వీనర్ ప్రిన్సిపాల్ కె.సురేష్, ప్రిన్సిపాళ్లు పైడి సూర్యకుమారి, అరుణ్‌జ్యోతి, తిరుపతి రాజు, అధ్యాపకులు నాగభూషణరావు, ప్రభాకర్, నాగమణి, శ్రీరామమూర్తి, సత్యవతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.